
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 18 ఆగస్టు 2025



ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్య నివారణ పద్ధతులపై ప్రముఖ సైకాలజిస్టు కే పున్నంచందర్ విద్యార్థులకు మార్గదర్శకాలు చేశారు. జాతీయ సామాజిక సేవా వారోత్సవం-2025లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ సామాజిక శాస్త్రం, సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో సోషల్ వర్క్ విద్యార్థులకు సైకలాజిస్ట్ కే పున్నంచందర్ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నం చందర్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో ఆత్మహత్య భావన పెరుగుతోం దని, దీన్ని సామాజిక బాధ్యతగా అందరూ గుర్తించాలన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అధ్యాపకులు ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారిని గుర్తించవచ్చునని అందులో వారి లక్షణాలను వివరించారు. సామాజిక సంబంధాల నుంచి దూరమవడం, ఒంటరిగా ఉండడాన్ని ఇష్టపడుతుంటారన్నారు. నిద్ర, ఆహారపు అలవాట్లలో మార్పులు రావడాన్ని గమనించాలన్నారు. డిప్రెషన్ భావాలను వ్యక్తపరచడం హానికర పదార్థాలను వినియోగం పెరుగుతుందన్నారు. ఇలాంటి లక్షణాలను గమనించి తల్లిదండ్రులు, స్నేహితులు, ఉపాధ్యాయులు వారికి నిపుణులతో కౌన్సెలింగ్ చేయించాలన్నారు. భవిష్యత్తులో సోషల్ వర్క్ విద్యార్థులు సమాజంలో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, సేవలు, సహాయక వాతావరణాలను సృష్టించడం వంటి బాధ్యతలను చేపట్టాలని సూచించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం స్వర్ణలత, సామాజిక శాస్త్రం, సంక్షేమ శాస్త్రం బోర్డు ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ ఎం ఐలయ్య, అధ్యాపకులు డాక్టర్ కే సుభాష్, డాక్టర్ ఎస్ సాహితి, పరిశోధక విద్యార్థులు, సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.

అయోమయానికి తెర

- ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వ ఉత్తర్వులు
- నేటి నుంచి టెండర్ ప్రక్రియ ప్రారంభం
- సెప్టెంబరు 15లోగా పంపిణీ పూర్తి
- జిల్లా 1.42 కోట్ల చేపపిల్లలు అందజేయాలని లక్ష్యం



జిల్లాలో ఇప్పటీ వరకు చేపపిల్లలు వదిలిన తీరు

సంవత్సరం	చెరువులు /కుంటలు /జలాశయాలు	వదిలినవి
2016- 17	92	30.5 లక్షలు
2017- 18	66	20 లక్షలు
2018- 19	95	57.48లక్షలు
2019- 20	313	100.91 లక్షలు
2020- 21	362	115.61 లక్షలు
2021- 22	392	119.25 లక్షలు
2022 -23	392	138.27 లక్షలు
2023 -24	440	141.00 లక్షలు
2024-25	324	46.71 లక్షలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మత్స్యకారులకు ఆర్థికంగా చేయూత నిచ్చే ఉచిత చేప పిల్లలు(సీడ్) పంపిణీపై నెలకొన్న అయోమయానికి తెరపడింది. చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోమవారం నుంచి టెండర్ ప్రక్రియ ప్రారంభించే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లా మత్స్యకారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నీళ్లను ఎత్తిపోతలతో నింపుతున్నారు. ఈ నేపథ్యంలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ సెప్టెంబరు 15లోగా పూర్తిచేసే విధంగా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు జిల్లా మత్స్యశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి చేప పిల్లల పంపిణీ దాదాపు 1.42 కోట్ల మేరకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిసింది.

జిల్లాలో మత్స్య సహకార పరిస్థితి ఇది...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నిత్యం నీటిపై పోరాటం చేస్తూ ఉపాధిని అందుకుంటున్నారు. జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో 401 చెరువులు ఉన్నాయి. 168మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, 9220 మంది సభ్యులు ఉన్నారు. 48 మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం వరకు మిడ్ మానేరులో చేపలు పట్టడానికి 741 మంది మత్స్యకారులకు, ఎగువ మానేరు ప్రాజెక్టులో 251 మంది, అన్నపూర్ణ ప్రాజెక్టులో 52 మంది మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీ చేశారు.

నీటి సామర్థ్యం మేరకు పంపిణీ..

వానాకాలం సీజన్‌లో ఆలస్యంగా వర్షాలు మొదలయ్యాయి. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. చెరువులు, కుంటల్లో చేపలు పెంచేందుకు ఉన్న నీటి సామర్థ్యం మేరకు చేప పిల్లలను వదిలే విధంగా మత్స్య శాఖ నిర్ణయించింది. జిల్లాలో నీటి లభ్యతపై మత్స్యశాఖ సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ మేరకు నివేదిక అందించాలని తహసీల్దార్‌లకు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్‌లో నివేదిక ప్రకారం చెరువుల్లో చేపపిల్లలను వదలనున్నారు.

టెండర్ల ప్రక్రియ వేగవంతం

గత సంవత్సరం చేప పిల్లల పంపిణీకి ఆలస్యంగా టెండర్లు జరగడంతో పాటు సమయం లేకపోవడంతో అంచనా లక్ష్యాన్ని సగానికి తగ్గించి చేపపిల్లలను వదిలారు. 2024-2025 సంవత్సరానికి రూ.1.59 కోట్ల విలువైన 1.41 కోట్ల చేప పిల్లల సరఫరాకు టెండర్లు పిలిచిన చివరకు 46.71 లక్షల చేపలను 324 చెరువులు కుంటల్లో వదిలారు. దీంతో చేపల ఎదుగుదల లేకపోవడంతో మత్స్యకారులకు అనుకున్న మేరకు లబ్ధి చేకూరలేదు. ఈసారి ఆగస్టు 30వ తేదీ వరకే టెండర్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా

మిగతా 8వ పేజీలో

నిధులు మంజూరు చేయాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి వినతి



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో వెంకటేశ్వర స్వామి శిథిలావస్థలకు చేరుకోవడంతో గ్రామస్థులందరూ కలిసి ఆలయ పునర్నిర్మాణం పనులకు శ్రీకారంచుట్టారు. ఆలయ ప్రహరీ, బోరు మోటారుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బండి సంజయ్‌కుమార్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు బుగ్గారెడ్డి, కుమార్, ఆలయ కమిటీ సభ్యులు బాలయ్య, శంకర్, సత్యనారాయణరెడ్డి, రవి, వెంకటేశ్, శ్రీనివాస్, బాలరాజు తదితరులు ఉన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో 'ప్రజావాణి' రద్దు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాని వాతావరణ శాఖల అధికారుల సూచనల మేరకు జిల్లా స్థాయి అధికారులందరూ క్షేత్రస్థాయిలో విధులను నిర్వహిస్తున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దుచేశామని పేర్కొన్నారు. ప్రజలందరు ఈ విషయాన్ని గమనించి వారి సమస్యలపై దరఖాస్తులు ఇవ్వడానికి సోమవారం కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

గణేష్ నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్పీ మహేష్ బీ గితే

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : శాంతియుత వాతావరణంలో ప్రజలు గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని ఎస్పీ మహేష్ బీ గితే అన్నారు. రానున్న గణేష్ ఉత్సవాలు సందర్భంగా ఆదివారం ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లాలో గణేష్ మండపం నిర్వహణకు తెలంగాణ పోలీసు శాఖ రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపానికి సంబంధించిన సమాచారం కోసం మాత్రమేనని తెలిపారు. ఈ సమాచారం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారానే మంజూరుచేయడం జరుగుతుందన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని అన్నారు. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. శోభాయాత్ర సందర్భంగా డీజే ఏర్పాటు చేయవద్దన్నారు. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం పూర్తిగా నిషేధించామని పేర్కొన్నారు. నిర్దేశించిన సమయనికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. మండపాల వద్ద ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

యాదవ జాతి గౌరవాన్ని నిలబెట్టాలి

- రెజాంగ్లా రాజ్ కలశ యాత్ర కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్



శ్రీనివాస్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఐక్యతను చాటుతూ హక్కుల సాధన కోసం ఉద్యమిస్తూ యాదవ జాతి గౌరవాన్ని నిలబెట్టాలని రెజాంగ్లా రాజ్ కలశ యాత్ర కన్వీనర్, మాజీ సైనికుడు జక్కుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బీహార్ నుంచి ప్రారంభమైన రెజాంగ్లా రాజ్ కలశ యాత్ర ఆదివారం జిల్లా కేంద్రంకు చేరుకోగా జిల్లా స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జక్కుల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. 1962లో భారత - చైనా యుద్ధంలో 3వేల మంది చైనా సైనికులను ఎదుర్కొని 1400 మందిని భారత సైనికులు మట్టుబెట్టడం జరిగిందన్నారు. దేశం కోసం చేసిన యుద్ధంలో దాదాపు 114మంది యాదవ వీరులు ప్రాణత్యాగాలను చేశారని ఆ వీరయోధుల స్మారకార్థంగా అహిర్(యాదవ్)రెజిమెంట్ స్థాపన కోసం బీహార్ నుండి రెజాంగ్లా రాజ్ కలశ యాత్రను స్థాపికి 120 రోజుల అవుతుం దని అన్నారు. 28 రాష్ట్రాలు దాటి ఆగస్టు 9న నారాయణపేట గుండా తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించామ పేర్కొన్నారు. యాత్రలో యాదవ సోదరులు పాల్గొని వీరమరణం పొందిన యాదవ బిడ్డలను గౌరవించుకోవాలన్నారు. మన యాదవ జాతి గౌరవాన్ని నిలబెట్టాలి మన చరిత్రను మనమే తిరిగి రాయాలని పేర్కొన్నారు. స్వాగతం పలికిన వారిలో జిల్లా, స్థానిక యాదవ మహాసభ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆహిర్ రెజిమెంట్ స్థాపనకు మద్దతు ఇవ్వాలి..

తంగళ్లపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆహిర్ రెజిమెంట్ స్థాపనకు మద్దతు ఇవ్వాలని రిటైర్డ్ ఆర్మీ కల్నల్ జక్కుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రేజాంగ్లా చాజ్ కలశ యాత్ర ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రానికి చేరుకోగానే నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లడుతూ ఆర్మీలో ఆహిర్ రెజిమెంట్ పునఃస్థాపనకు యాదవులు అహర్నిశలు పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆర్మీలో యాదవ ఆర్మీ జవాన్లు దేశభక్తి, శౌర్యం, త్యాగం అనే విలువలను ప్రతిబింబిస్తున్నారన్నారు. యుద్ధంలో ఎంతోమంది యాదవ ఆర్మీ జవాన్లు అసువులు బాసారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ఏటి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆసరి బాలరాజు, కార్యదర్శి మీరాల శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షుడు మాసం భాస్కర్, నాయకులు గంధం సంపత్, కవాటి మల్లేశం, గోగు మల్లేశం, శ్రీనివాస్, అంజయ్య, సాయి ప్రసాద్, గంగాధర్, గోపాల్, తిరుపతి, కిషన్, హబీష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి..

- కాంగ్రెస్ వచ్చాక మానేరును ఎడారిలా మార్చారు - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్



పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

సిరిసిల్ల ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేత్రంలోకి నాయకులు వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన సమయం ఇదని.. ఎక్కడికి అక్కడ తమ పరిధిలో ఉన్న సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో సిరిసిల్ల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు, బూత్ కమిటీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. అంతకుముందు సిరిసిల్లలో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ చెందిన మాజీ ఎంపీటీసీ కుంటయ్య ఆత్మహత్య చేసుకోగా, ఆయన కూతురు లక్షిత వివాహాన్ని తానే స్వయంగా జరిపించి ఆశీర్వదించారు. అనంతరం సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ పల్లెల్లో వీధి దీపాలు వెలగడం లేదని, శానిటేషన్ జరగడం లేదని, ఇతర సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. గత పదేండ్ల కాలంలో సిరిసిల్ల మానేరు మండుటెండల్లో నిండుగ పారేది, కాంగ్రెస్ వచ్చాక ఎడారిలా మార్చారని అన్నారు. యూరియా కొరతతో కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరిగే ముఖం లేకుండా పోయిందని. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైకు పడితే హామీల అమలుపై మాట్లాడమంటే, బూతులు మాత్రమే మాట్లాడుతున్నాడని అన్నారు. 42 శాతం కాంట్రాక్టు పనులు బీసీలకు ఇస్తామని, బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తామని అది కూడా చేయలేదన్నారు. సిరిసిల్ల వస్త్ర వ్యాపారులు విద్యుత్ బిల్లుల సబ్సిడీ ద్వారా చెల్లించాలని ప్రభుత్వంపైన ఒత్తిడి చేయాలని అన్నారు. రాబోవు ఎన్నికలకు అందరం సిద్ధంగా ఉండాలని, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు అన్నింటిలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని అన్నారు. గ్రామాలు, మండలాల వారీగా ఇన్‌చార్జిలను నియమిస్తామని ప్రజల వద్దకు వెళ్లాని, కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను వీడియోలుగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టులు చేయాలని అన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో మీరంతా నాకోసం పని చేశారని, రాబోవు మున్సిపల్ ఎన్నికలలో మీ విజయం కోసం పనిచేస్తాను' అని అన్నారు. మన హయాంలో పదేళ్లపాటు అందరికీ మంచి చేశాం తప్ప, ఎవరికి చెడు చేసే అలవాటు మనకు లేదు... ఎవరైనా మన జోలికి వస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పోలీసు కేసులు పెట్టడం, జైలుకు పంపడం అనే విధంగా మారిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో సాయిరెడ్డి అనే వ్యక్తి ఇంటి ముందు గోడ కట్టి అతడు ఆత్మహత్య చేసుకునే వరకు పరిస్థితి ప్రభుత్వం తెచ్చిందని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ఏ ఒక్క పథకాన్ని ఆపకుండా అమలు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని అన్నారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం కేసీఆర్ పాలనలో రూ 2 లక్షల కోట్లు అప్పు మాత్రమే చేసిందని ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికీ కేసీఆర్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని కేసీఆర్‌కు మళ్లీ ఓటు వేసేందుకు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో నాఫ్స్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు,సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమా, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఆకునూరి శంకరయ్య, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌ఛైర్మన్ మురళి, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాంమోహన్, ధార్న లక్ష్మీనారాయణ, మ్యాన రవి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై రోడ్డెక్కుదాం..

- మాజీ మంత్రి కేటీఆర్



కేటీఆర్‌కు ఎరువుల కొరతను వివరిస్తున్న రైతులు

గంభీరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల కొరతపై అవసరమైతే రోడ్డెక్కుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రైతులతో అన్నారు. గంభీరావుపేట మండల నర్మాల గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ కార్యకర్త కూతురు వివాహానికి కేటీఆర్ వచ్చి వెళుతున్న సమయంలో అక్కడి రైతులు తమ ఇబ్బందులు చెప్పుకున్నారు. ఎరువుల ఇబ్బందులను ఇంతగా ఎప్పుడూ చూడలేదని, తమ గోడు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కేటీఆర్ మాట్లాడుతూ ఎరువుల కొరత తెలంగాణ వ్యాప్తంగా ఉందని, ఎరువుల కోసం ఇక రోడ్డెక్కుడేనని అన్నారు. గతంలో పంటల సాగు సీజన్ రాకముందే కేసీఆర్ ముందు చూపుతో రైతులకు సరిపడా ఎరువులను సమకూర్చారన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఎరువుల కొరతపై రోడ్డెక్కుడే మార్గమని రైతులకు భరోసా ఇచ్చి అక్కడినుంచి వెళ్లిపోయారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ..




రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

7

'దృశ్యం' పదిలం..

- రేపు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటో తీస్తున్న యువకుడు

6

దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ

- శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారులకు చీర, సారె అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్



కడప పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని బాల్‌నగర్‌లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్వహిస్తున్న కడప పూజకు వెళ్లి లబ్దిదారులకు చీర, సారెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం యజ్ఞంలా నిర్వహిస్తుందని అన్నారు. పేదల స్వంత ఇంటి కల ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతోందని ప్రజలు ఆనందపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం డుబల్‌బెడ్రూం ఇల్లు కట్టిస్తానని మోసంచేసిందని విమర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరమ్మ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే కొందరికి బేస్మెంట్ లెవెల్, మరికొందరివి స్లాబ్ దశ వరకు పనులు పూర్తయ్యాయని అన్నారు. తమ ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులను జమచేసిందని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని లబ్ధిదారుల ఇంటికి ఏదో ఒక దశలో వెళ్లి చీరె, సారెలను అందజేస్తానని మాట ఇచ్చానని, తప్పకుండా వెళతానన్నారు. లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూస్తే ఎన్ని కోట్లు పెట్టినా ఈ సంతోషాన్ని తీసుకురాలేమన్నారు. నిస్సహాయులకు సహాయాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పొందిన మహిళల సంతోషం వెలకట్టలేనిదని, గతంలో పూరి గుడిసెల్లో, రేకుల షెడ్లల్లో, చెట్లకింద నివాసమున్న వాళ్లకు ప్రజాప్రభుత్వం ఇందిరమ్మరాజ్యం లో ఇళ్లు మంజూరు చేసిందని వివరించారు. ఆనాడు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఈనాడు తామే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కనికరపు రాకేష్, పుల్కం రాజు, ఫోంచెట్టి శంకర్ తదితరులు ఉన్నారు.

కారుకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

గంగాధర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌లో ఇంటిపక్కన పార్క్‌చేసిన కారుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయనవివరాల ప్రకారం.. మధురానగర్‌లో మోతె శ్రీహరిరెడ్డి తన కారును ఇంటిపక్కన పార్క్ చేశాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారుకు నిప్పంటించారు. గమనించిన శ్రీహరిరెడ్డి మంటలను ఆర్పి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం

గంగాధర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం.. గంగాధరకు చెందిన పెగుడ మల్లమ్మ(73) శనివారం ఇంటినుంచి బయటికి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. వృద్ధురాలు మల్లమ్మ తమ్ముడు ఈరవేణి రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన లారీ

శంకరపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్ శివారులో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సును లారీఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి కరీంనగర్‌కు ఆర్టీసీ వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సును శంకరపట్నం మండలం తాడికల్‌శివారులో ఎదురుగా వస్తున్న లారీఢీకొట్టింది. ఈఘటనలో ఆర్టీసీ బస్సు పాక్షికంగా దెబ్బతింది. డ్రైవర్ సతీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణి స్తున్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగ లేదు. స్థానికుల సమాచారంతో బ్లూకోర్టుసిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

'దృశ్యం' పదిలం



- మధుర స్మృతులు శాశ్వతం
- రేపు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అందమైన, అద్భుతమైన సన్నివేశాలను కెమెరాలో భద్రపరిస్తే జీవితకాలం పదిలంగానే ఉంటాయి. నాటి జ్ఞాపకాలను ఎల్లప్పుడూ తనివి తీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చేవి ఫొటోలు. అపురూప బంధాలను, మధురమైన క్షణాలను అజరామరాం చేయడమే కాదు చరిత్రను మేలుకొలిపే శక్తి ఫొటోలకు ఉంది. దృశ్యం క్షణకాలంలో చెరిగిపోతుంది. ఆ దృశ్యాన్ని బంధీ చేసేది.. మధుర స్మృతులను శాశ్వతంగా నిలిపేది ఫొటోగ్రఫీ. ఏ శుభకార్యమైనా కెమెరా లేకుండా జరుపుకోవడం అనేది ఊహించని విషయమే. ఫొటోగ్రఫీ నాటి నుంచి నేటి వరకు అనేక ఆధునిక పోకడలను సొంతం చేసుకుంది. కెమెరాకు దాదాపు 186 సంవత్సరాలు నిండాయి. ఎన్నో ఏళ్ల క్రితం ప్రారంభమైన ఛాయా చిత్ర ప్రస్థానం ఎన్నో మార్పులు చెందింది. ప్రతి యేటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● నేపథ్యం ఇది..



ఫొటోగ్రఫీ అనే పదం రెండు గ్రీక్ పదాల కలయిక నుంచి వచ్చింది. ఫోటో అంటే 'కాంతి'... గ్రాఫ్ అంటే రాయడం.. అంటే కాంతితో రాయడం అనే అర్థం వస్తుంది. 1820లో ఫొటో తీసే పరికరాన్ని ఫ్రెంచి శాస్త్రవేత్త జోసఫ్ నీస్ ఫోర్ తయారుచేసి తొలి ఫోటోను తీశారు. 1839 ఆగస్టు 18న ఫ్రాన్స్‌కు చెందిన ఎల్‌జె ఎం డాగూరే సిల్వర్ అయోడైడ్ విధానం ద్వారా దృశ్యాన్ని శాశ్వతంగా ఉంచవచ్చని నిరూపించాడు. 1839 ఆగస్టు 19న ఈ విషయాన్ని ప్రపంచానికి చాటారు. 1839లో ఫ్రాన్స్ నుంచి ఇంగ్లాండుకు చేరితే అదే సమయంలో భారతదేశానికి వచ్చింది. 1961లో కరీంనగర్‌లో మొదటిసారి ఫోటోస్టూడియో ఏర్పాటు చేశారు. 1980లో కంప్యూటర్ రైజ్డ్ ప్రింటింగ్ మిషన్లతో కలర్ ఫొటోగ్రఫీ ప్రభంజనం మొదలైంది.

● సెల్ఫీ.. సెల్ఫీ:

కెమెరా కనుగొన్నప్పటికీ మొదట ఫొటోలు తీయడం పెద్ద ప్రహసనంగానే ఉండేది. మొదట కెమెరా చాలా పెద్దదిగా ఉండేది. ఒక వాహనానికి అమర్చి ఫొటోలు తీసేవారు. ఇప్పుడు సెల్‌ఫోన్ రాగా, అందులో కెమెరా ఫోన్లతో ఫొటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు వచ్చాయి. గతంలో ఫొటోలు తీసుకోవాలంటే కెమెరాలు, మరో వ్యక్తి అవసరం వచ్చేది. ఇప్పుడు సెల్‌ఫోన్ వల్ల ఫ్రంట్ కెమెరాతో సెల్ఫీల జోరందుకుంది.

● ఫొటోగ్రఫీ కోర్సులు

ఫొటోగ్రఫీ ద్వారా విస్తృత అవకాశాలున్నాయి. వివిధ కంపెనీలకు ఫొటోగ్రాఫర్లు అవసరం ఉండగా, పత్రికల్లో ఫొటోగ్రాఫర్లుగా, సినిమా స్టూడియోల్లో కూడా అవకాశాలున్నాయి. ఫొటోగ్రఫీ కోర్సులు కూడా లభిస్తున్నాయి. జేఎన్‌టీయూలో బ్యాచిలర్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వెంకటేశ్వర ఫైన్‌ఆర్ట్స్ కళాశాల, లకోటియా ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్, జేఎన్‌టీయూలో విజువల్ కమ్యూనికేషన్‌లో శిక్షణ, అంతేకాకుండా ప్రైవేటు సంస్థలు ఆన్‌లైన్‌ల ద్వారా కూడా కోర్సులు అందిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో గిరిజ న ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు ఫొటోగ్రఫీ కోర్సులను కూడా అందిస్తున్నారు. ఫొటోగ్రఫీలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి బండి రాజన్‌బాబును స్ఫూర్తిగా తీసుకుని ఎంతో మంది ఫొటోగ్రాఫర్లు అంతర్జాతీయ కీర్తి కెరటాల వైపు దూసుకెళ్లారు.

అద్భుతం.. ఆయన ఫొటోగ్రఫీ



మండలోజు శ్రీనివాస్



మల్యాల: మల్యాలకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ మండలోజు శ్రీనివాస్ ఫొటోగ్రఫీలో అద్భుతంగా రాణిస్తూ, రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాడు. 45 ఏళ్లుగా కళాత్మక చిత్రాలు తీస్తూ ప్రశంసలు పొందుతున్నారు. ఏ రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ పోటీలు జరిగినా ఆయన పాల్గొంటారు. మల్యాల కెమెరా క్లబ్‌ను స్థాపించి వినూత్నమైన ఫొటోలు తీస్తూ ఆకట్టుకుంటున్నాడు.

నీరుకుళ్లలో తాటి, ఈత చెట్లు ధ్వంసం

సుల్తానాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నీరుకుళ్ల గ్రామంలో నాటిన తాటి ఈత చెట్లను కొందరు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారని గీత కార్మికులు తెలిపారు. ఆదివారం ఉదయం పనులు ముగించుకుని ఇంటికి వెళ్ళిన సమయంలో భూమి యజమానులుగా చెపుకుంటున్న కొందరు చెట్లను ధ్వంసం చేయిస్తూ భూమి చదును చేస్తున్న సమాచారాన్ని తెలిసిందన్నారు. తాము సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చామని గీత కార్మికులు శ్రీనివాస్, మల్లేశం తదితరులు తెలిపారు. ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించలేదన్నారు. ఇటీవల ఈ భూములను కొన్నామని చెబుతున్న వ్యక్తులు దాదాపు వంద చెట్లను ధ్వంసం చేయించారని కార్మికులు తెలిపారు. ఇరువర్గాల వారు పోలీసుల వద్దకు వెలుతున్నట్లు తెలిపారు.



ధ్వంసమైన తాటి, ఈత చెట్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సందీప్(ఫైల్)

హుజూరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణంలోని కిందివాడకు చెందిన హోంగార్డు బొడిగ తిరుపతి కుమారుడు సందీప్(25) ఆదివారం తన స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ విషయంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉరివేసుకొని ఒకరి బలవన్మరణం

సైదాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన సంతపురి రవీందర్‌రెడ్డి(65) అనారోగ్య కారణాలతో శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. రవీందర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతోపాటు తనను చూసుకోవడానికి ఎవరూ లేరని బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9గంటల ప్రాంతంలో ఇంటి ముందు రేకుల కింద పడుకుంటానని చెప్పి వెళ్లాడు. ఉదయం ఆరు గంటలకు మృతుడి భార్యలేచి చూసేసరికి రేకులకు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. వెంటనే ఆమె కూతురు శైలజకు సమాచారం అందించింది. మృతుడు రవీందర్‌రెడ్డి కూతురు శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

బావిలో పడి మతిస్థిమితం లేని మహిళ మృతి

శంకరపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ మహిళ వ్యవసాయ బావిలోపడి మృతిచెందిన సంఘటన శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం కాచాపూర్ గ్రామానికి చెందిన అబ్బు శకుంతల (58) అనే మహిళ కొంతకాలంగా అనారోగ్యం, మానసిక సమస్యలతో బాధ పడుతోంది. కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రిలో చూపించి వైద్యం చేయిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో భర్త నిద్రిస్తుండగా శకుంతల బయటకు వెళ్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహాయంతో వ్యవసాయ బావినుంచి శకుంతల మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ మృతి



కొండ్ర రమేష్(ఫైల్)

తిమ్మాపూర్/మానకొండూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మేస్త్రీ మృతిచెందిన సంఘటన మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన కొండ్ర రమేష్(50) మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రమేష్ రోజులాగానే ఆదివారం కూడా మండలంలోని శ్రీనివాస్ నగర్‌లో ఎరవేణి లక్ష్మణ్ ఇంటి నిర్మాణం పనులకు మేస్త్రీగా పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తున్న క్రమంలో రమేష్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే అతన్ని చికిత్సనిమిత్తం కరీంనగర్ తరలించగా ఆసుపత్రికి తీసుకెళ్లే సరికే మృతిచెందాడు. ఈ మేరకు మానకొండూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



రాజనర్సు(ఫైల్)

పెగడపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెగడ పల్లి మండలం బతికెపల్లి గ్రామానికి చెందిన మన్నె రాజనర్సు(59)అనేవ్యక్తి ఆదివారం చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా పొలం గట్టుపై నుంచిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం చెరువులో చేపలు పట్టి తిరిగి వస్తుండగా పొలం గట్టుపై నుంచి జారిపడ్డాడు. దీంతో రాజనర్సు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మన్నె లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

బంగారు పతకాలు సాధించిన సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. అండర్-20 విభాగంలో 100మీటర్స్‌రన్నింగ్‌లో గణేష్, లాంగ్‌జంప్‌లో విష్ణువర్ధన్ బంగారు పతకాలను సాధించారు. అండర్-16 హైజంప్ విభాగంలో అభిలాష్, 3కిలోమీటర్లు, 5కిలోమీటర్ల నడకలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాలను సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కాగా పతకాలు సాధించిన విద్యార్థులను పీఈటీ సుమన్, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్‌రాజ్ అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

నగరానికి చేరుకున్న రెజంగ్ల రజ్ కలశ యాత్ర



రథయాత్రలో యాదవ సంఘం నాయకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీహార్ నుంచి ప్రారంభమైన 122రోజుల రెజంగ్ల రజ్ కలశ యాత్ర ఆదివారం నగరానికి చేరుకుంది. 1962లో జరిగిన యుద్ధంలో 1400మంది చైనా సైనికులను మట్టుపెట్టి ప్రాణత్యాగం చేసిన 114మంది యాదవ వీరుల సంస్మరణార్థం అహిర్(యాదవ్) రేంజ్‌మెంట్ స్థాపనకోసం బీహార్ నుంచి యాత్ర ప్రారంభించారు. యాత్రకు అఖిల భారత యాదవ మహాసభ సంఘం జిల్లా నాయకులు స్వాగతం పలికారు. వివేకానంద స్కూల్లో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు యాత్ర ఉద్దేశాన్ని వివరించారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు, ర్యాలీ కన్వీనర్ సందెవేని మహేందర్, ఓదేలు, సొగాని కొమురయ్య, నాగారపు సత్యనారాయణ, జక్కుల శ్రీనివాస్, జంగిలి ఐలేందర్, మంచాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో చోరీ

చందుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోదాం కార్యాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సైరమేష్ కథనం ప్రకారం.. గ్యాస్ గోదాం ఆవరణలో కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.7000ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శనివారం ఇండియన్ గ్యాస్ గోదాంకు తాళంవేసి ఇంటికి వెళ్లి ఆదివారం ఉదయం 8 గంటలకు వెళ్లి చూడగా, ఆఫీస్‌రూమ్ గోడకు రంధ్రంచేసి, ఆఫీస్‌లో రికార్డ్స్ చెల్లాచెదురుగా పడేశారు. కౌంటర్‌లోగల ఏడు వేల రూపాయలు నగదు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

● ఇద్దరికి తీవ్ర గాయాలు

చందుర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారని తప్పించుకునేందుకు బైక్‌ను అకస్మాత్తుగా వెనక్కి మలపడంతో ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన చందుర్తిమండలం మూడపల్లి బస్టాండ్‌సమీపంలో ఆదివారం చోటుచేసుకుం ది. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని సనుగుల గ్రామా నికి చెందిన బొజ్జ చరణ్, ఎండి షారుక్ అనే ఇద్దరు యువకులు బైక్‌పై వేములవాడ వెళ్తున్నారు. మూడపెల్లి గ్రామంలోని కోరుట్ల-వేములవాడ ప్రధానరహదారిపై బైక్‌పై వేములవాడవైపు వస్తుండగా, మూడపల్లి బస్టాండ్‌వద్ద పోలీసులు వాహనాలు తనిఖీచేస్తున్న క్రమంలో నర్సింగాపూర్ వైపునకు రోడ్ క్రాస్ చేస్తుండగా వేములవాడ వైపు వెళ్లే కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీబస్సును ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ఎండి షారుక్, చరణ్‌కు గాయాలు కాగా షారుక్ తలకు తీవ్రగాయం కాగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే

● అధ్వానంగా గ్రామీణ రోడ్లు

రామడుగు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చాలు గ్రామీణ రోడ్లన్నీ చిత్తడి అవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారుల తోపాటు అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. ఎటు చూసినా బురదమయమైన రోడ్లు ప్రత్యక్షమవుతున్నాయి. గోపాల్‌రావుపేట నుంచి ప్రధానరహదారి అక్కడక్కడ గుంతలమయమై నీళ్లు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో గుంతలు పడి దిగబడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటీవల అక్కడ మట్టి పోయడంతో కొంత మెరుగ్గా కనబడినప్పటికీ ప్రస్తుత వర్షాలకు తిరిగి యథాస్థానానికి వచ్చే పరిస్థితి నెలకొంది. రామడుగు, గోపాల్‌రావుపేట, చిప్పకుర్తి, రామచంద్రపురం, వెదిర, గుండి, లక్ష్మీపూర్ తోపాటు అన్ని గ్రామాల్లో రోడ్లు దెబ్బతిని చిన్న వానకే కాలుతీసి కాలు వేయని పరిస్థితి నెలకొంది. వెంటనే రోడ్లను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రామడుగులో బురదమయమైన అప్రోచ్ రోడ్డు



గోపాల్‌రావుపేటలో అధ్వానంగా మారిన రహదారి

ట్యాంకర్ ఢీకొని పాదచారుడి మృతి

● వాహనం సమాచారం ఇచ్చిన యువకుడికి సీఐ అభినందనలు



శివకుమార్‌ను అభినందిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్‌పై సిమెంట్ టాంకర్ ఢీకొన్ని ప్రమాదంలో పాదచారుడు దుర్మరణం చెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన అస్తపురం రవి(35) ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బొమ్మకల్ ఫ్లైఓవర్‌పై నడుచు కుంటూ వెళుతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. కిందపడిపోయిన రవి రెండుకాళ్లపై నుంచి లారీవెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ ఆగకుండా వెళ్లిపోయింది. దీనిని గమనించిన సుల్తానాబాద్ గట్టెపల్లికి చెందిన బండారి శివకుమార్ అనేయువకుడు ట్యాంకర్‌ను బైక్‌పై వెంబడించి ఒక హోటల్ వద్ద నిలిపి వేయించాడు. ట్యాంకర్ వివరాలు, డ్రైవర్ వివరాలు సేకరించిన శివకుమార్ కరీంనగర్ రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు ప్రమాదానికి కారణమైన ట్యాంకర్‌ను, డ్రైవర్ ఉత్తర ప్రదేశ్‌కు మీర్జాపూర్‌కు చెందిన కృష్ణకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్యాంకర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన టాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ పట్టుకుని సమాచారాన్ని అందించిన బండారి శివకుమార్‌ను సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

సర్దార్ సర్వాయి పాపన్న సేవలను గుర్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి

చిగురుమామిడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న సేవలను గుర్తు చేసుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి వేడుకల నిర్వహణపై సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. గౌడ సోదరులు ముందుండి బహుజనులను ఆహ్వానిస్తూ, పాపన్న బహుజనుల కోసం చేసిన సేవలను తెలియజేయాలన్నారు. గ్రామాల్లో సర్వాయి పాపన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి వేడుకలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు ముంజ ప్రకాశ్, ప్రచార కార్యదర్శి పచ్చిమట్ల శ్రీనివాస్, సుందరగిరి గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళపల్లి సంపత్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తాళ్ళపల్లి చంద్రయ్య, తాళ్ళపల్లి కిరణ్, కక్కర్ల వీరకుమార్, మహేందర్, శ్రీనివాస్, సురేష్, ముంజ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై నరేశ్‌కుమార్

మల్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందినచందు అనే యువకుడు రెండు నెలల క్రితం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా ఆదివారం పోలీసులు పట్టుకొని అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్ ట్రాక్‌చేయగా సెల్‌ఫోన్ ఆచూకీ లభించింది. దీంతో ఆదివారం బాధితుడు చందుకు ఫోన్‌ను ఎస్సై నరేశ్‌కుమార్ అప్పగించారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణకుమార్ ఉన్నారు.

డీఎల్ఎడ్ కోర్సులో స్పాట్ అడ్మిషన్స్

తిమ్మాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ప్రభుత్వం స్పాట్ అడ్మిషన్స్‌కు అవకాశం కల్పించినట్లు మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీసెట్ 2025 ఉత్తీర్ణులై, అర్హత, ఆసక్తి ఉండి, ఇప్పటివరకు ప్రవేశం పొందని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీసెట్2025 వెబ్‌సైట్‌ను పరిశీలించి తమతమ కేటగిరి సీట్లు ఖాళీగా ఉన్న కళాశాలను ఎంపిక చేసు కోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 19న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణాసంస్థ, ఎల్ఎండీ కాలనీకి రావాలని పేర్కొన్నారు. 20న ప్రైవేటు కళాశాలలకు ఉదయం 10 గంటలకు వెళ్లి సంబంధిత సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కరీంనగర్-1 డిపో నుండి తీర్థయాత్రలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ విజయమాధురి ఒకప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్ నుండి 21వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకి బస్సు బయలుదేరుతుందన్నారు. అన్నవరం, పిఠాపురం శక్తి పీఠం, సింహాచలం, వైజాగ్, ఆర్కె బీచ్, ద్వారక తిరుమల దర్శనాల అనంతరం 23వ తేదీ కరీంనగర్ చేరుకుంటుందన్నారు. ఈ బస్సులో పెద్దలకు 3000 రూపాయలు, పిల్లలకు 2250 రూపాయలుగా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు 9959225920, 8074690491, 7382849352 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సర్వాయిపేటకు పర్యాటక శోభ

- పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు అభివృద్ధి పనులు
- నేడు సర్వాయి పాపన్న జయంతి

సైదాపూర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో సర్దార్ సర్వాయి పాపన్న నడయాడిన నేల సర్వాయిపేట గ్రామ ప్రాంతం ఇక పర్యాటక కేంద్రంగా మారనుంది. సర్వాయి పాపన్న గుట్టలను, ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో తెలంగాణ ప్రభుత్వం రూ. 4.32 కోట్ల నిధులు విడుదల చేసింది. దాంతో పాపన్న గుట్ల వద్ద ఇదివరకు ఉన్న పాపన్న విగ్రహం కాకుండా ఓ కొత్త భారీ విగ్రహం నిర్మిస్తున్నారు. అలాగే గుట్టపైకి మెట్ల మార్గం నిర్మించడంతో పాటు మరిన్ని అభివృద్ధి



సర్వాయిపేటలో ఉన్న పాపన్న కోట ముఖద్వారం

పనులు చేస్తున్నారు. అయితే ఈ పనులు పూర్తయితే ఈ నెల 18న పాపన్న జయంతి రోజున విగ్రహంతో పాటు, మెట్ల మార్గాన్ని ప్రారంభించే అవకాశముంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సర్వాయిపేట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని, అప్పటి పీసీసీ అధ్యక్ష హోదాలో పాదయాత్రలో భాగంగా సర్వాయిపేటకు వచ్చినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేశారు.



సర్వాయిపేట కొమ్ముగుట్ట వద్ద నిర్మిస్తున్న పాపన్న భారీ విగ్రహం

అధికారికంగా పాపన్న జయంతి నిర్వహించాలి

సర్వాయి పాపన్న చాలా సంవత్సరాలు సర్వాయి పేట ప్రాంతంలో నివసించాడని, ఈ ప్రాంతంలో ఉండి అనగారిన వర్గాల కోసం పోరాటం చేశాడని, ఈ పాపన్న గుట్టల వద్ద ప్రభుత్వం అధికారికంగా పాపన్న జయంతి నిర్వహించాలని మండల ప్రజలు, వివిధ కుల సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక పాపన్న అనవాళ్లు ఉన్నాయని చెపుతున్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పాపన్న ఆనవాళ్లతో మ్యూజియం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. అంతేగాక పార్క్, తారురోడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, కొలను, ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సర్వాయిపేటలో పాపన్న ఆనవాళ్లు

సర్వాయిపేటలో శత్రువుల నుంచి రక్షణ కోసం పాపన్న నిర్మించుకున్న కోటలు, బురుజు, ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. కానీ దెబ్బతినే అవకాశముందని వాటిని మరమ్మతు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పాపన్న గుర్తులుగా కోటగిరి గట్టు, గొలుసుకట్టు చెరువులు, గుట్టలు, పాపన్న చెరువు, గుట్టపై పాపన్న ఆనవాళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షించే అవకాశముంది.



గుట్టపైకి వేస్తున్న మెట్ల మార్గం


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు



శివకుమార్, శీలం శ్రీహర్ష

శంకరపట్నం/సైదాపూర్/మల్యాల/బీర్‌పూర్/జగిత్యాలరూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల జిల్లాల నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. శంకరపట్నం మండలం కేశవపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సానియా, ఆదిదుర్గ, సైదాపూర్ మండంలోని ఆకునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ముగ్గురు విద్యార్థులు బొడిగె లహరి, మండల ప్రగతి, పెద్ది సాత్విక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎంలు సుభాష్, రామస్వామి తెలిపారు. మల్యాల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఈ శివకుమార్ అనే విద్యార్థి, బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ జిల్లా పరిషత్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి శీలం శ్రీహర్ష, జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు గమ్య, గీతిక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆయా పాఠశాలల హెచ్ఎంలు అనుపమ, భాస్కర్ రెడ్డి, లతాదేవి తెలిపారు.

పరిశోధన పత్రాలతో పుస్తకం.. ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

గణేశ్‌నగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల కామర్స్ విభాగం జాతీయ సదస్సుకు సంబంధించిన ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజిమెంట్ అనే పుస్తకాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం కరీంనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సాంకేతికతో వ్యాపార వాణిజ్య, బ్యాంకింగ్, బీమా రంగాల్లో అనేక మార్పులు సంభవిస్తున్నాయని, వాటిపై పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయమని అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, సమన్వయకర్త డాక్టర్ మల్లారెడ్డి మాట్లా డుతూ ఇటీవల ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ కళాశాల కామర్స్ విభాగం ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో సమర్పించిన 45 పరిశోధన పత్రాలను ఈపుస్తకంలో ప్రచురించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్, రాజయ్య, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ దుష్ప్రచారం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని, అధికారం కోసం దేశభద్రతనే పణంగా పెట్టడం మంచి పద్ధతి కాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో గెలిచింది కాంగ్రెస్ పార్టీయే కదా. ఇక్కడ కూడా ఈవీఎం మిషన్లతోనే ఎన్నికలు జరిగాయి. మీరు గెలిస్తే మిషన్లు పనిచేసినట్టు, ఎలక్షన్ కమిషన్ పనిచేసినట్లా. ఓడిపోతే ఎలక్షన్ కమిషన్ పనిచేయనట్లా' అని ప్రశ్నించారు. ఓట్ల చోరీ జరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇదెక్కడి దిక్కుమాలిన ఆలోచన అని అన్నారు. హైదరాబాద్‌లో అద్దెకు ఉండేవాళ్లు ఒక ప్రాతం నుంచి ఇంకో ప్రాంతానికి మారుతూ ఉంటారని, ఊరు నుంచి పట్టణాలకు వలస వస్తూ ఉంటారని అన్నారు. వారి ఓట్లను సరి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ మీద ఉంటుందని, ఓట్ల నమోదు, డబుల్ ఓట్ల తొలగించే విధానం నిరంతర ప్రక్రియ అని అన్నారు. బీహార్ బోర్డర్ ఉన్న ప్రాంతం, ఇక్కడికి బంగ్లాదేశ్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అవకాశం ఉందని, అలా వచ్చినవారికి ఆధార్ కార్డులు, సిటిజన్‌షిప్ ఇవ్వడం ఎంత మాత్రం దేశానికి క్షేమం కాదని అన్నారు. ఓట్ల కోసం అధికారం కోసం దేశ భద్రతనే పణంగా పెడతా అంటే మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి చవకబారు ఆరోపణలు సరికాదని, ఎన్నికల కమిషనర్ స్వతంత్ర సంస్థ అని అన్నారు. సుప్రీంకోర్టు కూడా కొన్ని ఆదేశాలు జారీ చేసిందని, దాని ప్రకారం నిర్ణయాలు ఉంటాయి తప్ప పార్టీకి, ప్రభుత్వానికి ఏం సంబంధం ఉంటుందని ప్రశించారు. ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా అన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- వేములవాడ, ధర్మపురిలో భక్తుల రద్దీ



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించకుని రాజన్న ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. సుమారుగా రెండు గంటలపాటు కోడెమొక్కు టికెట్‌ల కోసం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిరాజరాజేశ్వర స్వామివారలను దర్శించుకున్నారు. కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భీమేశ్వరస్వామి, బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సమీప గ్రామాల ప్రజలు స్వామివారికి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు, అర్చకులు స్వామివారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామివారల నిత్యకల్యాణం, నరసింహ హోమం జరిపించారు.

ఘనంగా ఏకాదశ రుద్రాభిషేకం

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, తీర్థ, ప్రసాదాల వితరణ జరిపారు. అనేక మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.



ఏకాదశ రుద్రాభిషేకంలో పాల్గొన్న వేదపండితులు

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

- 1,51,806 క్యూసెక్కుల నీరు రాక



వరద కాలువలో ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ నీరు

జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు రావడం భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి 1,51,806 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. రాత్రికి క్రమంగా ఇన్‌ఫ్లో 1,42,905 క్యూసెక్కులకు తగ్గినా ఒకటి రెండు రోజుల్లో ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని అధికారులు అంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, విష్ణుపురి పరివాహక ప్రాంతం నుంచి గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 68.431 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వరద కాలువకు నీరు విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు ఆదివారం ఉదయం 11.30 గంటలకు హెడ్ రెగ్యులేటరీ ద్వారా నీటి విడుదలను చేశారు. ముందుగా 3,000 క్యూసెక్కుల నీటిని వరద కాలువకు విడుదల చేసినప్పటికీ కొద్దికొద్దిగా పెంచుతూ మధ్యాహ్నం ఒంటి గంట వరకు 4,000 క్యూసెక్కులు, సాయంత్రం ఐదు గంటల వరకు 10,000 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం నాగాపూర్ వద్ద వరద కాలువ టాప్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. పలు ప్రాంతాల్లో గల వరద కాలువలో భారీగా నీరు ప్రవహిస్తోంది.

గంగాధర: వరద కాలువకు విడుదల చేసిన శ్రీరాంసాగర్ నీరు ఆదివారం గంగాధర మండలం మీదుగా మిడ్‌మానేరుకు నీరు చేరుతోంది. మరోవైపు మూడు రోజులు రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌజ్ నుంచి నాలుగు మోటర్లతో కాళేశ్వరం నీరును వరదకాలువకు విడుదల చేశారు. శ్రీరాంసాగర్, గాయత్రీ పంపు నీరుతో వరదకాలువ నిండుకుండలా ప్రవహిస్తోంది.

లింకు కాలువకు నీరు నిలుపుదల..

ర్యాలపల్లి వరద కాలుపై ఏర్పాటు చేసిన లింకు కాలువకు నీరును నిలిపివేశారు. రెండురోజులుగా ర్యాలపల్లి వరద కాలువ నుంచి మల్యాల మండలం తాటిపల్లి కాకతీయ కాలువకు 900 క్యూసెక్కుల నీరును విడుదల చేశారు. శ్రీరాంసాగర్ నీరు విడుదల చేయడంతో లింకు కాలువ గేట్లు మూసివేశారు.

గాయత్రి పంపుహౌజ్ నుంచి..



గాయత్రి పంపుహౌజ్ నుంచి ప్రవహిస్తున్న నీరు

రామడుగు: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌజ్ నుంచి మిడ్ మానేరుకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం నాలుగు పంపుల ద్వారా గ్రావిటీ కెనాల్‌కు నీటిని విడుదల చేయగా నేరుగా వరద కాలువ ద్వారా మానేరుకు చేరుతోంది. నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు తరలివెళ్తుండగా కాలువ నిండుగా కనిపిస్తోంది. ప్రస్తుతం పై నుంచి వస్తున్న వరద నేపథ్యంలో నాలుగు పంపులు ఆన్ చేసిన అధికారులు ఐదవ పంపు కూడా రన్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మిడ్ మానేరులో పది టీఎంసీలు..

బోయినపల్లి: మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎల్లంపల్లి జలాల ఎత్తిపోతలతో పాటు మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఆదివారం సాయంత్రం వరకు 9,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతోంది. గాయత్రి పంప్ హౌస్ నుంచి 9,300 క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా మరో 110 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోందని ప్రాజెక్ట్ డీఈ రాజు తెలిపారు. ప్రాజెక్ట్ నీటి నిల్వసామర్థ్యం, 27.55 టీఎంసీలకు గాను 10.984 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

28 ఫీట్లకు చేరిన ఎగువ మానేరు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం నీటి మట్టం 28 ఫీట్లకు చేరింది. ఎగువన రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు పొంగి పొర్లుతోంది. దీంతో మానేరు జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మొత్తం 31 ఫీట్ల నీటి సామర్థ్యం ఉన్న మానేరు ప్రస్తుతం 28 ఫీట్లకు చేరింది. మత్తడి దూకేందుకు మరో మూడు ఫీట్ల నీరు అవసరం ఉంది.

ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 5,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకుగాను 18.536 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి నంది పంప్‌హౌజ్‌కు 12,600 క్యూసెక్కులు, ఎన్‌టీపీసీకి 121క్యూసెక్కులు, హైద్రాబాద్ మెట్రో వాటర్ సప్లయ్‌కి 295క్యూసెక్కుల నీటి ఔట్ ఫ్లో కొనసాగుతోంది.

సుందిళ్ల బ్యారేజీకి..



సుందిళ్ల బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

మంథనిరూరల్: భారీ వర్షాలు, ఎగువ నుంచి వరద నీరు రావడంతో మంథని మండలంలోని సిరిపురం వద్ద ఉన్న సుందిళ్ల బ్యారేజీలోకి ఆదివారం ఉదయం వరకు లక్షా 63 వేల 241క్యూసెకుల నీరు వచ్చి చేరింది. బ్యారేజీలో 74గేట్లు ఎత్తి ఉండటంతో నీరు దిగువకు వెళుతోంది. దిగువ ప్రాంతంలో ఉన్న ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మంథని, ఖానాపూర్, ఖాన్‌సాయిపేట, ఆరెంద గ్రామల వరకు గోదావరిలో నీటి మట్టం పెరిగింది. మరో వైపు మానేరు నదిలో నీటి ప్రవహం పెరిగింది.

నిలకడగా గోదావరి ప్రవాహం ..

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో గోదావరి నది వరద ఆదివారం నికకడగా కొనసాగింది. గోదావరి ఎగువ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతుంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు చేరింది. ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి నీరు విడుదల చేశారు. తర్వాత గేట్లు మొత్తం మూసి వేసి ఉంచారు.

నేడు జేఎన్‌టీయూలో అవగాహన కార్యక్రమం

కొడిమ్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం 2025 విద్యార్థులకు (స్వయం ప్రతిపత్తి) అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వివిధ విభాగాల అధిపతులు కళాశాల విద్యావిధానం, సదుపాయాలను గురించి అవగాహన కలిపిస్తారన్నారు. కార్యక్రమానికి ఎస్పీ అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్ రెడ్డి, రెక్టార్ డాక్టర్ కె విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె వెంకటేశ్వర్‌రావు ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు.

దొనూర్ ఆలయంలో వరద పాశం



వరదపాశం నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొనూర్ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు ఆధ్వర్యంలో వరద పాశం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు చెందిన పంట పొలాలు మంచిగా పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ స్వామి వారిని వేడుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, ధర్మకర్త బొల్లారపు పోచయ్య, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గంధం రమేష్, పోడేటి తిరుపతి, పల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

జానపదం.. అతని ప్రాణం..

- ఓసీపీ-3లో ఈపీ ఫిట్టర్‌గా విధులు
- గానం, నృత్యంలో రాణింపు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటున్న రమణయ్య

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ళ వయస్సులో పాఠశాలలో పాటల పోటీల్లో వచ్చిన ప్రైజ్‌లు... చప్పట్లు సంతోషపడేలా చేశాయి... వాటికి తోడు తల్లిదండ్రులిద్దరూ జానపద కళాకారులు కావడం వారి ప్రోత్సాహంతో జానపద గానాలు, నృత్యాలపై పెంచుకున్న మక్కువే అతనికి ప్రాణమయ్యాయి... రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ప్రశంసలందుకునేలా చేశాయి... అతనే కనకం రమణయ్య..

కళాకారులకు...గని కార్మికులకు నిలయమైన గోదావరిఖనికి చెందిన కనకం రమణయ్య జానపద గాయకుడిగా, నృత్య కళాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. వృత్తి రీత్యా సింగరేణి ఓసిపి-3లో ఈపీ ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు.



మలేషియాలో జరిగిన సాంస్కృతిక పోటీల్లో పాట పాడుతున్న రమణయ్య(ఫైల్)

సింగరేణిలో పనిచేస్తూ జానపదంపై ఉన్న ఇష్టంతో ఇప్పటికీ పలు పోటీల్లో పాల్గొంటూ బహుమతులు, అవార్డులు అందుకుంటున్నాడు. ఎనిమిదేళ్ల వయస్సులో చదువుకున్న పాఠశాలలో జరిగిన పోటీలలో పాడిన పాటలకు బహుమతులు రావడంతో కలిగిన సంతోషమే కళా రంగంపై దృష్టి సారించేలా చేసింది. దానికి తోడు తల్లిదండ్రులిద్దరు కళాకారులు కావడంతో మరింత ప్రోత్సాహం లభించింది. పాటలలో గురువు తల్లి బాలమ్మ కాగా, డప్పు నృత్యంలో తండ్రి అంకూస్ నుంచి పునికి పుచ్చుకొని జానపద నృత్యంలో నర్సింగరావు వద్ద శిష్యరికం పొందాడు. చిన్ననాటి నుంచి రమణయ్య పాల్గొన్న ప్రతీ పోటీల్లో బహుమతులు రావడం, పలువురి ప్రశంసలందుకుంటూనే ఉన్నాడు. సింగరేణి సంస్థ పరంగా జరిగే కోలిండియా స్థాయి సాంస్కృతిక పోటీల్లో పాల్గొని సంస్థ కీర్తిని చాటాడు. అంతేకాకుండా పలు నాటకాల్లో నటించి శభాష్ అనిపించుకో వడంతోపాటు 'గోదారి గల గలలు', 'సింగరేణి స్వరాలు", జై వీరాంజనేయ ఆడియో పాటల క్యాసెట్లతో ఆలపించాడు. పలు సామాజిక కార్యక్రమాల్లో కూడా రమణయ్య నృత్యంతో చైతన్య పరిచాడు. 2009లో మలేషియా తెలుగు ఎక్స్‌పో దీపావళి సంబరాలలో జానపద గాయకుడిగా పాల్గొని అక్కడి తెలుగు వారి ప్రశంసలు పొందాడు. మూడున్నర దశాబ్దాలుగా అటు సింగరేణి సంస్థలో కార్మికుడిగా పనిచేస్తూనే జానపద కళాకారుడిగా ప్రదర్శనలిస్తూ



సినీ నటుడు నూతన్‌ప్రసాద్ చేతుల మీదుగా బహుమతి తీసుకున్న రమణయ్య(ఫైల్)

గోదావరి కళా సంఘాల సమాఖ్యకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు రమణయ్య.

గోదావరి కళా సంఘాల సమాఖ్యతో ఉనికి..

గోదావరి కళా సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా కనకం రమణయ్య ఈ ప్రాంతంలో కళాకారుల, కళల ఉనికిని చాటుతున్నాడు. అందరితో కలిసి సమిష్టిగా ముందుకు వెళుతూ కళాకారులకు అభినందన కార్యక్రమాలు, ఉత్సవాలు చేస్తూ ఈ ప్రాంతంలో కళలు, కళాకారుల సంక్షేమానికి తన వంతు పాత్రను పోషిస్తున్నాడు రమణయ్య. ఈ ప్రాంతంలో కళాకారుల కోసం కళాభవన్ నిర్మించాలనేదే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

నాంపల్లి గుట్టపై సమస్యల తిష్ఠ

- శ్రావణ మాసం సందర్భంగా భారీగా తరలివస్తున్న భక్తులు - మురికి కూపంగా ధర్మగుండం.. - శిథిలావస్థలో మెట్ల మార్గం - పట్టించుకోని అధికారులు



నాచు, ప్లాస్టిక్ వ్యర్థాలతో మురికి కూపంగా ధర్మగుండం..



గుట్టపై అలంకారప్రాయంగా వాటర్ ఫౌంటెయిన్..



పిచ్చిమొక్కలతో నిండిపోయిన మెట్ల మార్గం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 17 : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి గుట్ట పర్యాటక ప్రాంతంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. గుట్ట మధ్యభాగంలో అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో నిర్మించిన కాళీయమర్ధనం, తలపై శ్రీ కృష్ణుడి నృత్యరూపం, చుట్టూ పచ్చని పంటపొలాలు, ఉత్తరం వైపు మూలవాగు అందాలు, దక్షిణ వైపు మానేరువాగు అందాలు, తూర్పు వైపు మానేరువాగు, మూలవాగు కలిసే మధ్యమానేరు డ్యామ్ బ్యాక్ వాటర్ వ్యూ చూపరులను ఇట్టే కట్టిపడేస్తుంది. నాంపల్లి గుట్ట. ఆరు వందల సంవత్సరాల క్రితమే గుట్టపైన మూడు నామాల రూపంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రతిమ, కుడివైపున హనుమంతుడి ప్రతిమ వెలిసినట్లు చెబుతారు. ఎంతో విశిష్టిత మహిమాన్వితంగా వెలుగొందుతూ, కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల కొంగుబంగారంగా వీరజిల్లుతున్న నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం శ్రావణమాసం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకుని అక్కడ విడిది చేసే విధానం భక్తులు ఆచారంగా వస్తోంది. అయితే నిత్యం వేల మంది భక్తులు వచ్చే నాంపల్లి గుట్టపైన భక్తులకు సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కనుమరుగు కానున్న మెట్ల దారి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి అనుబంధ నాంపల్లి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయం ఎంతో పురాతనమైనదిగా ప్రసిద్ధి కెక్కింది. అయితే నాంపల్లి గుట్టపైకి పూర్వం నాంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి మెట్లదారి గుండా భక్తులు వెళ్లేవారు. రాజన్న దర్శనం చేసుకున్న అనంతరం భక్తులు వేములవాడ బస్టాండు సమీపంలోని ఆటోల సహాయంతో నాంపల్లి స్కూల్ వద్ద దిగి నడక మార్గంలో గుట్టపైకి చేరుకునేవారు. దీంతో పాటు వేములవాడ, తిప్పాపూర్, కొనాయపల్లి, శాత్రాజుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు శ్రావణ మాసంలో నడుచకుంటూ ఆలయానికి చేరుకునేవారు. అయితే అనుపురం గ్రామ శివారులో ఘాటు రోడ్డు నిర్మాణంలో మెట్లదారిని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో మెట్లమార్గంలో వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పూర్తిగా చెట్లు ఏపుగా పెరిగి మెట్లు కనబడకుండా విస్తరించడంతో నడక మార్గంలో వెళ్లే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెట్లు పూర్తిగా కనబడకుండా పచ్చికబయళ్లతో కప్పుకుని ఉండటంతో నాంపల్లి గ్రామానికి చెందిన యువకులు తీవ్రస్థాయిలో ఆలయాధికారుల తీరును విమర్శిస్తున్నారు.

ధర్మగుండంపై పట్టింపేదీ?

నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్థానిక గ్రామాలకు చెందిన ప్రజలు బియ్యం సమర్పించి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఎన్నో యేళ్ల చరిత్ర కలిగిన ధర్మగుండంలో తడిబట్టతో స్నానం చేసి ఆలయాని వెళ్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే కొంతకాలంగా నాంపల్లి గుట్టపైన గల ధర్మగుండం ఆలన, పాలన లేకపోవడంతో పూర్తిగా మురికి కూపంగా మారింది. నెలరోజుల క్రితం ఓ వ్యక్తి ధర్మగుండంలో పడి మృతిచెందడం ధర్మగుండం లోతుగా ఉండటంతో భక్తులు ప్రమాదాల బారిన పడకుండా బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ధర్మగుండం విశిష్టతను ఆలయాధికారులు కాపాడలేకపోతున్నారని సమీప గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ధర్మగుండాన్ని శుభ్రపరిచి భక్తులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో సిద్ధుల గుహ..

నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజ సిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతోపాటు పలు విగ్రహాలు ఉన్నాయి. క్రీ.శ 10వ శతాబ్దంలో నవనాథ సిద్ధులు(తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని, ప్రతి నిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహ పక్కనే మరో గుహలోని భూగర్భ మార్గం నుంచి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని చేరుకుని పూజలు చేసేవారని చెబుతారు. గుహలను వీక్షించేందుకు స్థానికులు, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు నాంపల్లికి వస్తుంటారు. అలాంటి గుహ పూర్తిగా కూలిపోయి మట్టితో కనిపిస్తూ భక్తులను వెక్కిరిస్తోంది. పూర్తిగా చీకటిమయంగా ఉండటంతో భక్తులు గుహలోకి వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నారు. గుహను ఆధునికీకరించి అందులో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తే భక్తులకు ఆహ్లాదకరంగా ఉంటుందని చెబుతున్నారు. అంతేకాకుండా గుట్టపైన ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ కూడా పని చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్వహణ లోపంతోనే..

- మేర్గు లక్ష్మణ్, నాంపల్లి గ్రామస్థుడు



వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధ ఆలయం నాంపల్లి గుట్ట. ప్రతి సంవత్సరం వందల కోట్ల ఆదాయం ఉన్న ఆలయ అనుబంధ ఆలయమైన నాంపల్లి గుట్టపై అధికారులకు సరైన నిర్వహణ లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారు. శ్రావణ మాసం వస్తున్న ధర్మగుండం శుభ్రం చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

మెట్ల దారిని పునరుద్ధరించాలి..

- జగన్నాథం శ్రీనివాస్, భక్తుడు



నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ఆలయానికి చిన్నతనం నుంచి వెళుతున్నాం. నాంపల్లి గ్రామంలోని స్కూల్ నుంచి మెట్లదారి మీదుగా గుట్టపైకి చేరుకునే వాళ్లము, మెట్లు పూర్తిగా పిచ్చిమొక్కలతో కప్పుకుని, పచ్చికబయల్లతో కనిపించడం తీవ్ర అసహనానికి గురిచేసింది. ఆలయాధికారుల నిర్వహణ లోపంతోనే ఇలాంటి సంఘటనలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా గుట్టపైకి వెళ్లేందుకు మెట్ల దారిని అధికారులు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలి.

అయోమయానికి తెర..

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈనెల 18న టెండర్లకు ఆహ్వానం పలకనున్నారు. టెండర్లను ఈనెల 30 తేదీన ముగించి అదేరోజు టెండర్లను ప్రకటిస్తారు. టెండర్‌లో పాల్గొనే వారికి బిడ్ ఫీజు రూ.25 వేలు నిర్ణయించారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సెప్టెంబరు 15లోగా చేప పిల్లల పంపిణీ కూడా పూర్తిచేస్తారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై

కోనరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో ఆదివారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు సైబర్‌మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్‌మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా మోసాలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అనుమానాస్పద లింకులు, ఎస్ఎంఎస్‌లను క్లిక్ చేయవద్దని అన్నారు. యువత తల్లిదండ్రులు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యమే కాకుండా భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. మొబైల్ గల్లంతు అయినప్పుడు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ లాక్ చేయడం, ట్రాక్ చేయడం వంటి విషయాలు కూడా వివరించారు. ప్రజలు ఈ పోర్టల్ గురించి తెలుసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, సేవించినా సమాచారం ఉంటే వెంటనే 100 కు లేదా 1908 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్ట వ్యతిరేకమైన పనులు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కాలువ భూమి కబ్జా

- యాభై ఎకరాలు అన్యాక్రాంతం - ఏటా నీట మునుగుతున్న పంటలు - పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని కుడికుంట్ల కుంట నుంచి రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువుకు వచ్చే వరద నీటి కాలువ కొందరు రైతుల స్వార్థానికి మాయమైంది. కిలో మీటరు దూరం పొడవునా ఉన్న 50 ఎకరాల విస్తీర్ణంలోని కాలువ స్థలం అన్యాక్రాంతమైంది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కబ్జాకు గురైంది. వరద కాలువను అక్రమించుకుని కొందరు రైతులు వరి పంటను సాగు చేసుకోవడంతో దిగువన ఉన్న తమ పంట పొలాలు నీట మునుగుతున్నాయని బాధిత రైతులు పేర్కొంటున్నారు. మాయమైన వరద కాలువపై సర్వే జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతులు ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.



కాలువను ఆక్రమించి సాగు చేసిన వరి పంట

కాలువను పూడ్చి.. పంట వేసి..

మండలంలోని రాచర్లతిమ్మాపూర్ శివారులోని వరద నీరు దొసకుంట ప్రాంతం మీదుగా రాచర్లబొప్పాపూర్‌లోని జక్కుల చెరువుకు కాల్వ ద్వారా చేరుతుండేది. కిలో మీటరు పొడవునా ఉన్న కాలువకు ఇరువైపుల కొందరు రైతులు పూడ్చి వేశారు. దర్జాగా ఆక్రమించుకుని వరి పంటను సాగు చేశారు. వరద కాల్వను పూడ్చి వేయడం వల్ల భారీ వర్షాలకు వరద నీరు దిగువన ఉన్న 20 మంది రైతులకు చెందిన 40 ఎకరాల విస్తీర్ణంలోని పంటలు నీటిపాలవుతున్నాయి. వరద తాకిడికి కొట్టుకుపోతున్నాయి. ఎగువ ప్రాంతంలోని కొందరు రైతులు వరద కాల్వను పూడ్చడం వల్ల తమ పంటలు మునిగిపోతున్నాయని బాధిత రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాగా తమ పట్టా స్థలంలో నుంచే వరద కాల్వ పోయిందని పూడ్చిన రైతులు పేర్కొంటున్నారు. దాంతో ఇరు వర్గాల నడుమ కాల్వ వివాదం నెలకొంది. పరిష్కరించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడం వల్ల వరద కాల్వ కనుమరుగై దిగువ రైతుల పంటలు నీటిపాలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి వరద కాలువను కాపాడడంతో పాటు తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

సర్వే జరిపించి చర్యలు తీసుకుంటాం..

- సత్యనారాయణ, డీఈ, నీటి పారుదల శాఖ

మండలంలోని రాచర్లతిమ్మాపూర్ నుంచి రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని జక్కుల చెరువుకు వచ్చే వరద నీటి కాల్వకు పూడ్చివేసినట్లు తమ దృష్టికి వచ్చింది. కాల్వపై క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించాలని తహసీల్ అధికారులకు సూచించాం. సర్వే నివేదిక ఆధారంగా సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రతి యేటా పంట మునిగిపోతోంది..

- పర్శ శేఖర్, యువ రైతు, రాచర్లతిమ్మాపూర్



గ్రామ శివారులో తమకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. వరి పంట సాగు చేస్తూ జీవిస్తున్నాం. ఎగువన ఉన్న వరద కాల్వను కొందరు రైతులు పూడ్చి సాగు చేసుకోవడంతో వర్షాకాలంలో వరద దాటికి ప్రతియేటా పంట మునిగిపోతోంది. పంట పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకుండాపోతోంది.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

- కొండ ప్రశాంత్, రైతు, రాచర్లతిమ్మాపూర్



మాకున్న మూడెకాలలో పొలంలో సాగు చేశాం. ఎగువ ప్రాంతంలోని వరద కాల్వను కొందరు రైతులు పూడ్చివేశారు. నీటి పారుదల శాఖ అధికారులు, ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండాపోయింది. వరద నీటికి పొలం పూర్తిగా నీటితో నిండిపోతోంది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

కల్వర్టు నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కోనరావుపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న కల్వర్టు పనులవల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండల బీజేపీ అధ్యక్షుడు మిరియాల బాలాజీ అన్నారు. ఆదివారం నిర్మాణం అవుతున్న పొలంలో పరిశీలించి మాట్లాడారు. ప్రత్యామ్నాయంగా రహదారిని ఏర్పాటు చేయకుండా కల్వర్టు పనులు ప్రారంభించడం వల్ల మండల ప్రజలు వేరే దారి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే సదర్ కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా రహదారిని ఏర్పాటు చేసి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బైరగోని సురేష్, తీగల రవీందర్ గౌడ్, బడే నర్సయ్య, దుర్గం తిరుపతి, మల్లేశం, సుమన్, వేణు తదితరులు ఉన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

ఇల్లంతకుంట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి బాబుకు చెందిన ఇల్లు వర్షాలతో కూలడంతో మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత నిత్యావసర వస్తువులను అందజేశారు. కూలిన ఇంటిని ఆదివారం పరిశీలించి సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసువెళుతానని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు బాబుకు వచ్చేలా కృషిచేస్తానని తెలిపారు. పాత ఇళ్లలో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దమ్మని లక్ష్మి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బెజ్జంకి తిరుపతి, నాయకులు జేరిపోతుల కళ్యాణి, దమ్మని లక్ష్మన్, బెజ్జంకి తిరుపతి, వెదిఎ శేఖర్, లింగాల తిరుపతి, దమ్మని వినోద్, బర్ల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు

రుద్రంగి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో అందించడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలం లేనివారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీలో దరఖస్తూ చేసుకోవాలన్నారు. మొదటి విడతలో రుద్రంగిలో 243ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకాగా సూమారు 170 వరకు నిర్మాణాలు జరగుతున్నాయన్నారు. రుద్రంగి అభివృద్ధి కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోట్ల రూపాయలు మాంజూరు చేయించారని, 30 ఏళ్ల కల అయినటువంటి ప్రభుత్వ ఆసుపత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.రుద్రంగిలో జరుగుతున్నా అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తురన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సారెడ్డి, పల్లి గంగాధర్, తర్రె లింగం, సిరికొండ రవి, గుగ్గిళ్ల వేంకటేశం, పండుగు గంగాధర్, దాసు, పల్లికొండ వినయ్, గండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని శాంతి నగర్‌లో శనివారం రాత్రి భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాంతినగర్ చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ నేతృత్వంలో పిల్లలు పాల్గొని ఉట్టి కొట్టే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు..

- వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్



గణేష్ మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. పట్టణంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మండపాల నిర్వాహకులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటు చేయవద్దని, మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. గణేష్ మండపాల వద్ద పోలీస్ అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి 10 గంటల తరవాత అధిక శబ్దాలు చేసే డిజేల వలన చిన్న పిల్లలు, విద్యార్థుల చదువుకు వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బంది కలుగుతుందని వివరించారు. వేములవాడ పట్టణంలో డీజే ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేవని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):వినాయక మండపాల నిర్వాహకులు అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో కోరారు. వినాయక నవరాత్రోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నందున యువకులు ప్రజలకు ఇబ్బందులు కలగని ప్రదేశాలలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి లక్ష్మణ్‌రావు అధ్యక్షతన ఆదివారం ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లింగారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రాజేశంలు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా కుబేరస్వామి, బాలయ్య, సంయుక్త కార్యదర్శిగా నాగేంద్రం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, పబ్లిసిటీ కార్యదర్శిగా నర్సయ్య, జిల్లా కౌన్సిలర్‌గా దరయ్యలను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఎన్నికల పరిశీలకుడు రాజారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన న్యాలపల్లి అజయ్ కుటుంబాన్ని తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుభాష్, తదితరులు ఉన్నారు.

రోడ్లను ఆక్రమిస్తున్న వ్యాపారులు



రాజన్న ఆలయ ధర్మసత్రానికి వెళ్లే రోడ్డుపైన సామగ్రితో వ్యాపారస్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే రోడ్లను సగం వరకు వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చే ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా భవనాలను కూల్చివేయడంతో ఆలయానికి వచ్చే మరో ప్రధానదారి మున్నూరుకాపు సత్రం నుంచి, సినిమా థియేటర్‌ల ముందు నుంచి రాజన్న ఆలయ విచారణ కార్యలయంకు వస్తారు భక్తులు. అక్కడి నుంచి రాజన్న ఆలయానికి వచ్చే రోడ్డుపైన ఇరువైపులా ఉన్న షాపులనిర్వాహకులు రోడ్డును ఆక్రమించి నడిచేందుకు వీలు లేకుండా తమ సామగ్రిని రోడ్డుపై ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయం నుంచి బద్దిపోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డులో సైతం ఇదే పరిస్థితి ఉండడంతో భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ

ఇల్లంతకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో కేసీఆర్ కిట్లను ఆదివారం మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండ్ర చందన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను పెంచాలని, తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం గత ప్రభుత్వం కేసీఆర్ కిట్లను పంపిణీ చేసిందన్నారు. కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈపథకాన్ని రద్దుచేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ కిట్ల పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు తోటపెల్లి తిరుపతి, నాయకులు జెట్టి నాగరాజు, ఐరెడ్డి అఖిల్‌రెడ్డి, జెట్టి నవీన్, హరికాంత్‌రెడ్డి, శ్రావణ్, ప్రశాంత్, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

ఇల్లంతకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామ ముత్యాల పోచమ్మ ఆలయ పాలకవర్గ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం సోమవారం జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతున్నందున అన్ని గ్రామాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాయితీ పనిముట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నందున ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5ఎకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు 50శాతం రాయితీ, ఇతర రైతులకు 40శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలను అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈనెల 23లోపు రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్‌పాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లను వ్యవసాయ విస్తీర్ణాధికారులకు అందివ్వాలన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రి చేసుకోవడంతోపాటు మట్టి నమూన పరీక్షలు చేసుకొని ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే వ్యవసాయ పనిముట్లలో బ్యాటరీ స్ప్రేయర్, రోటవేటర్, కల్టివేటర్, కట్టర్, సీడ్కం పర్టిలైజర్, డ్రిల్ ఉంటాయన్నారు.

ప్రోకబడ్డీకి నూకలమర్రివాసి ఎంపిక

వేములవాడ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యువ ప్రోకబడ్డీ పోటీలకు నూకలమర్రి గ్రామానికి చెందిన చందనం ప్రశాంత్ ఎంపికయ్యాడు. ఈనెల 24 నుంచి హైదరాబాద్‌లో తెలంగాణ యువ ప్రోకబడ్డీ పోటీలు ప్రారంభంకానున్నాయి. కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంపై ప్రశాంత్‌ను జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు సోమినేని బాలు, గ్రామస్థులు హర్షం అభినందించారు.

దర్శకుడికి సన్మానం

వేములవాడ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన దర్శకుడు బుర్ర శివకృష్ణగౌడ్‌కు నాంపల్లి గ్రామ యువత ఘనంగా సన్మానించారు. శివకృష్ణ ఇటీవల తీసిన సినిమా ఘన విజయం సాధించడంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొల్లం నాగరాజు, చిలువేరి బాబు, పొత్తూరి శ్రీనివాస్, చిలువేరి సత్తయ్య, మేర్గు ప్రేమ్‌కుమార్, పర్శరాములు, చిలివేరి రాజు, గురువేరు లచ్చయ్య, రాజు అజీం పాషా, బుర్ర సాయికృష్ణ తదితరులు ఉన్నారు.